# నిస్సీ జయధ్వజము

విడి పత్రిక రూ 8/-

ఫిబ్రవరి - 2016 | క్రైస్తవ ఆధ్యాత్మిక మాస పత్రిక | సంవత్సరపు చందా రూ. 100/-


# పలువిధములైన ద్రవ్యములు

మా కొట్లు నింపబడి పలువిధములైన ద్రవ్యములకు నిధులుగా ఉన్నవి. మా గొఱ్ఱెలు వేలకొలదిగాను పదివేలకొలదిగాను మా గడ్డి బీళ్లలో పిల్లలు వేయుచున్నవి.

కీర్తన 144:13

మనలను సృష్టించిన దేవుడు మన కొట్లను నింపేవాడు. మన గంపలు పిండి పిసుకు తొట్టిని దీవించేవాడు. పంటలను సమృద్ధిగా పండించేదేవుడు. వ్యాపారంలో అభివృద్ధిని కలిగించే దేవుడు. చేతిపనులన్నిటిని నిండుగా ఆశీర్వదించే దేవుడు. ఆయన నింపేవాడే కాని ఖాళి చేసేదేవుడు కాదు. అందుకే కీర్తన కారుడైన దావీదు మా కొట్లను పలువిధములైన ద్రవ్యములతో దేవుడు నింపాడని సాక్ష్యమిస్తున్నాడు.

ప్రియమైన దేవుని బిడ్డలారా! దావీదు జీవితంలోనే కాదు మనజీవితంలోకూడ ఇలాంటి నింపుదల అనుగ్రహించడానికే ఈ కడవరి కాలమందు దేవుడు మనతో మాట్లాడుచున్నాడు. వర్షాలులేక నీ పంటలు సరిగా పండక, నీ కొట్లు నిండక, బస్తాలు నిండక సమస్తం ఎండిపోయిన పరిస్థితులలో ఉన్నాదేమో కాని దేవుడు మన కొట్లన్నిటిని నింపుతానని వాగ్ధానం చేస్తున్నాడు. మీరు చేయు పనులను నేను ఆశీర్వదిస్తాను. మీ పంటలను తోటలను, పిల్లలను దుక్కిటెద్దులను సమస్తమును నింపి నిండుగా ఆశీర్వ దిస్తానని వాగ్ధానం చేస్తున్నాడు. ద్రాక్షారసం అయిపోయినప్పుడు రాతిబానలను నింపాడు. గాలియేకాని వర్షమేగాని రాలేదు త్రవ్విన గుంటలను నింపాడు మన దేవుడు. ప్రియమైనదైవజనాంగమా! ఈ రోజు నీ బ్రతుకంతా ఖాళీగా ఉందా? అయితే నీకుటుంబంలో కరువు ఏదైనా, లేమి ఏదైనా దిక్కుతోచని స్థితిలో ఉండి నాలుగు దిక్కుల నుండి సహాయం కొరకు ఎదురుచూసి విసిగి వేసారిన నీతో ప్రభువు మాట్లాడుతున్నాడు నేను నీ కొట్లను నింపుతాను. నీవు చేయు పనులను నేను ఆశీర్వదిస్తానని

దేవుడు వాగ్దానం చేస్తున్నాడు. పంటలు పండకపోయినను నీ కొట్లను నింపగలడు. నీకు రాబడి వచ్చే మార్గాలు లేకపోయిన నింపగలడు నింపడానికి ఆయన సమర్థుడు. ఏదో ఒక అద్భుతం నీ జీవితంలో చేస్తాడు. ఊహించని తలంచని కార్యాన్ని నీ జీవితంలో ఇలా జరుగుతుందని అనుకోనని గొప్పకార్యాన్ని నీ జీవితంలో చేసి నీ కొట్లను నింపుతాడు. మనలను ధనవంతులుగా చేయుటకే మన దేవుడు దరిద్రుడాయెను. దేవుని నమ్మిన ప్రతిఒక్కరి జీవితంలో దారిద్ర్యం, శాపం, రోగాలు, అప్పులు, చీకటి, కరువు ఈ లోక సంబంధమైనవి శపించబడినవి ఉండకుండ కొట్టివేయబడాలని ప్రభువు కోరిక. ఇక అవి నీ జీవితంలో క్రియ చేయడానికి వీలులేదు. యేసురక్తంలో కొనబడిన ఆయన సొత్తయిన ప్రజలము మనము. మనకొరకు దేవుడు వర్షాన్ని పంపుతాడు, మనకొరకు ఆయన గాలిని పంపుతాడు. మనకొరకు సూర్యచంద్రులను స్థంభింపజేస్తాడు.

దావీదు తన జీవితఅనుభవంతో మట్లాడుతున్నాడు. మా కొట్లు నింపబడి ఉన్నాయంటున్నాడు. " మా గొఱ్ఱెలు వేలకొలదిగాను పదివేల కొలదిగాను పిల్లలు వేయుచున్నవి" ఒకగొఱ్ఱె పది కనగానే కుంటుబడిపోకుండా వందలు వేలు గొఱ్ఱెలను కంటున్నాయి. కనడానికి ఏ డాక్టర్ శక్తినివ్వలేదు. గ్రామాలలో ఒక వ్యక్తికి రెండువందల గొఱ్ఱెలు ఉన్నాయంటే అతను గొప్పధనవంతునిగా చలామణి అవుతాడు. వేలకొలది గొఱ్ఱెలు అనగా గొడ్రాలితనం వాటిలో లేదు. సాధారణంగా 200 గొఱ్ఱెలను కాయడానికే నలుగురు ఐదుగురు కాపరులు మనకు కన్పిస్తుంటారు. ఈ వేవేల గొఱ్ఱెలను కాయుటకు ఎంతమంది కాపరులు కావాలి? మా కొట్లు నింపబడి పలువిధములైన ద్రవ్యములకు నిధులుగా ఉన్నవి. కొట్లు అనగా మన గృహాలను సూచిస్తుంది. పలువిధములైన ద్రవ్యములు ఒకటి రెండుకాదు ఒలీవపంట, ద్రాక్షాపంట రాగులపంట ఇలా ఎన్నోరకాలైన పంటలు ఉన్నాయి. ఈరోజు మన గృహాలను ఆత్మీయకంగా, ఆర్థికంగా నింపుకోవాలి దేవుడు నిన్ను అన్ని విధాలుగా నింపాలంటే నీవు మొదట ఆత్మీయకంగా బలపడాలి. మొదట మనగృహాలు (మనమే ఆయన ఇల్లు) ఆత్మీయకంగా నింపుకుంటే ఆటోమెటిక్‌గా మనం ఆర్థికంగా నింపబడతాము. ప్రభువు చెప్పినమాట ఒప్పుకోలు చేసుకుందాము "మీరు మొదట దేవునిరాజ్యాన్ని నీతిని వెదికితే అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును".

## మొదట హోమద్రవ్యముతో నింపబడాలి

**"దాని పులియబెట్టి కాల్చవలదు. నా హోమద్రవ్యములలో వారికి పాలుగా దాని నిచ్చియున్నాను. పాపపరిహారార్థబలి వలెను అపరాధ పరిహారార్థబలివలెను అది అతిపరిశుద్ధము. లేవి 6:17"**

పలువిధములైన ద్రవ్యములతో మన కొట్లు నింపుకోవాలి. మనం ఆత్మీయకంగా ప్రాణాత్మ దేహాలను దేనితో నింపాలి? దేవునివాక్యము చెప్పుతుంది హోమద్రవ్యములతో నింపాలి అని. హోమము అనగా ప్రార్థన మన గృహాలు మనహృదయాలు ప్రార్థనద్రవ్యంతో నింపుకోవాలని లేఖనాలు సెలవిస్తున్నాయి. మన ఇంట్లో ఎప్పుడు చూసినా ప్రార్థనా ఉండాలి. మన ఇంట్లో

టీ.విలు మ్రోగకూడదు, అరుపులు ఉండకూడదు, ప్రార్థనశబ్ధం ఇంట్లో ధ్వనించాలి. సమయం దొరకగానే ప్రార్థన వంటపని అయిపోగానే ప్రార్థన, పని అంతా అయిపోగానే ప్రార్థనచేసి, ప్రార్థనహోమంతో ఇల్లంతా నిండిపోవాలి. నీ ఇంట్లో ఎంత సమయం ప్రార్థన చేస్తున్నావు? ఎన్నిగంటలు ప్రార్థనలో గడుపుతున్నావు? ఉదయం సాయంత్రం ప్రార్థన చేస్తున్నావా? ఈ కార్యాలు ఏమిచేయకుండా యేసయ్యా మాగిన్నెలన్ని నింపునాయనా అంటే దేవుడునీకు ఆటవస్తువుగా కనిపిస్తున్నాడా? ఆయనఒక ప్రతిమగా కన్పిస్తున్నాడా? ఎప్పుడుచూసినా టీ.వినే ముందుపెట్టుకొని దానిముందునుండి లేచేదిలేదు, ప్రార్థన చేసేదిలేదు. నీ ఇంటిని దరిద్ర్యంగా మార్చేసింది టీ.వి. 24గం॥ టీ.వి చూసి కళ్లు కాయలైపోయాయి. ఆ టీ.వి నీ అప్పులు తీర్చాయా? నిన్ను బాగుచేసాయా? నీకు ఏమైనా ఫలితాన్ని ఇచ్చాయా? నీవు మంచివే చూసావేమో వాటిద్వారా నీకేమైనా మంచి జరిగిందా? జరగలేదు. నీవు ప్రార్థనతో నీ యింటిని నింపుకోవడంలేదు. నీ యింట్లో ధనాన్ని ఐశ్వర్యాన్ని దుక్కిటెద్దులను మేకమందలను ప్రభువు ఇవ్వలేక కాదు. నీవు మొదట నీ గృహాన్ని ప్రార్థనాగోపురంగా మార్చు. మోకాళ్లు నల్లబడితే నీ ముఖం ప్రకాశిస్తుంది. ప్రార్థనలేని ముఖంలో దైవకళ కన్పించదు ప్రార్థనలేకుండా ఏదైనకార్యం నీ గృహంలో జరుగుతుందని అనుకోవడం నీ భ్రమ. సమయం దొరికినప్పుడెల్లా ఎవరితోపడితే వారితో ముచ్చట్లు పెట్టకు, వ్యర్థమైన సంభాషణలు మానివేసి ప్రభుపాదాల చెంత మోకరించి నీ గృహాన్ని హోమద్రవ్యంతో నింపినయెడల దేవుడు నీకోసం ఆకాశంలో ఉన్న మంచి ధననిధిని తెరుస్తాడు. ప్రార్థన అనేది అయస్కాంతంలాంటిది. అయస్కాంతానికి ఉన్న లక్షణం ఇనుమును వెంటనే ఆకర్షించడం. ప్రార్థనకుఉన్న గుణం దేవుని సన్నిధిలో ఉన్న ఆశీర్వాదాలను వెంటనే ఆకర్షిస్తుంది. తద్వారా గృహాలు ఆశీర్వదింపబడ్తాయి.

## రెండవదిగా పరిమళద్రవ్యముతో నింపబడాలి

**"ప్రదీపమునకు తైలము, అభిషేక తైలమునకును పరిమళ ద్రవ్యముల ధూపమునకు సగంధ సంభారములు. నిర్గమ 25:6"**

పరిమళం అనగా సువాసన. నీవు శారీరకంగా మంచి శుభ్రతపాటించాలి. చక్కగా ఉతికిన వస్త్రాలు ధరించాలి. నీ వస్త్రాలుకూడా ఎవరికి ఇబ్బందికరంగా ఉండకూడదు ఎందుకనగా వస్త్రములయొక్క సువాసననుచూచి ఇస్సాకును యాకోబు దీవించాడు. యాకోబు మంచివస్త్రాలతో తన తండ్రిదగ్గరకు వచ్చాడు. తండ్రికి కన్నులు సరిగా కనిపించవు. వాసన చూసాడు "ఆహా... నాకుమారుని చేను యెహోవా దీవించిన సువాసనవలె ఉంది అని సువాసనను ఆస్వాదించి చాలా ఆశీర్వాదాలు ఇచ్చాడు. సువాసనను ఆత్మీయంగా గమనిస్తే అది మన సాక్ష్యజీవితానికి సూచనగా ఉన్నది. మన సాక్ష్యం బాగుండాలి. ఇంటిసాక్ష్యం వ్యక్తిగతసాక్ష్యం, భార్యగా నీ సాక్ష్యం, భర్తగా నీ సాక్ష్యం, పిల్లలుగా మీ సాక్ష్యం, ఉద్యోగంలో సమాజంలో నీ సాక్ష్యం బాగుండాలి. ఈ సాక్ష్యమే ఒక పరిమళవాసన. చెడుసాక్ష్యంనీ మీదికి రాకూడదు. మంచిసాక్ష్యం గలవ్యక్తిగా ఉండాలి. నీవు ఎక్కడఉన్నా ఏం చేసినా ప్రజలు నిన్ను గమనిస్తారు.

ఇతరులతో నీ గురించి త్రాగితే త్రాగుబోతని, తిరుగుతే తిరుగుబోతని, వదురుతే వదరుబోతని ఈవిధంగా సాక్ష్యం పలుకుతారు. అయితే మనం మంచి సాక్ష్యాన్ని పొందాలి. ఆ బ్రదర్ ఆ సిస్టర్ దేవునియందు భయభక్తులుగలవారు. కొందరు అసూయచేత నీతిమంతుడవైన నీ మీద చెడుసాక్ష్యం పలికినా అది నిలువదు. కొంతకాలమే. మాటనుబట్టి ప్రజలు సాక్ష్యాన్ని చెప్తారు. నీ సాక్ష్యం మంచిగా ఉండునట్లుగా నీ క్రియలు నీ నడక, చూపులు, ప్రవర్తన అంతా బాగుంటే ప్రజలు మంచిసాక్షము ఇస్తారు. మంచి సాక్ష్యంపొందిన నీవు ఇతరులకు దేవునిగూర్చిన సువార్త భోదించినప్పుడు ప్రజలు విని వారుకూడా ప్రభువును అంగీకరిస్తారు. నీ సాక్ష్యమే బాగలేక దేవునిమాటలు ఎవరికైనా చెబితే చెప్పావులే చాలు చాలు మొదట నీవు చక్కగాబ్రతుకు తర్వాత మాకుచెప్పు, నీ బ్రతుకే బాగాలేదు మాకు నీతులు చేప్తున్నావా? అంటారు. అలా అనే పరిస్థితిని మీరు తెచ్చుకోకూడదు. మన బ్రతుకు ప్రకాశమానమైన వెలుగుగా ఉండాలి. చీకటి మచ్చడాగు నీ బ్రతుకులో కన్పించకూడదు. యవనులైన, పిల్లలైనా పెద్దలైనా మంచిసాక్ష్యం పొందాలి. ధనంకంటే మంచిపేరు సాక్ష్యాన్ని సంపాదించాలి.

**గొప్ప ఐశ్వర్యముకంటె మంచిపేరును వెండి బంగారములకంటె దయయు కోరదగినవి. సామెతలు 22:1**

## మూడవదిగా కృతజ్ఞత బలిద్రవ్యముతో నింపబడాలి

**"ఆ పిండి వంటలేకాక సమాధానబలి రూపకమైన కృతజ్ఞతాబలి ద్రవ్యములో పులిసిన రొట్టెను అర్పణముగా అర్పింపవలెను. లేవి 7:13"**

దేవుడు మన జీవితంలో ఎన్నోమేలులు చేస్తున్నాడు. దేవుడు చేసిన మేళ్లను మరచిపోకుండా దేవుని యెడల కృతజ్ఞత కలిగివుండడమే కృతజ్ఞత బలిద్రవ్యం. గతంలోదేవుడు చేసిన మేళ్లను మరచిపోయి ఇప్పుడేదో నేను యిష్టానుసారంగా బ్రతుకుతానని అనుకోకూడదు. నీ జీవితంలో రక్షణపాత్రను ఎత్తుకున్న ప్రారంభదినం మొదలుకొని ఈరోజువరకు దేవుడు చేస్తున్న ప్రతి మేలును తలచితలచి దేవునికి కృతజ్ఞతాస్తుతి చెల్లించాలి. మోకరించి హృదయపూర్వకంగా ప్రభువా నీవు నాపట్ల చేసిన మేళ్లకై స్తోత్రాలు, నాకిచ్చిన పిల్లలకై స్తోత్రాలు, నాకిచ్చిన పంటను బట్టి స్తోత్రాలు, నాకిచ్చిన వాహనమునకై స్తోత్రాలు, నీవు నాకిచ్చిన ఆరోగ్యమునకై స్తోత్రాలు, నాకిచ్చిన సంఘమునకై స్తోత్రాలు, నీవు నాకిచ్చిన మంచి సేవకులనుబట్టి స్తోత్రాలు, నీవు నాకిచ్చిన ఉపదేశమునకై స్తోత్రాలు, నీవునాకిచ్చిన సకల ఈవులకై స్తోత్రం అని ప్రభువు నీ పట్ల నిత్యం చేస్తున్న మేళ్లన్ని కూడా తలచి దేవునికి కృతజ్ఞతాస్తుతి చెల్లించాలి. దేవుడు నా పట్ల ఏం చేసాడు? అని దేవునిమీద సణిగి తిరుగుబాటుచేసే వ్యక్తులుగా వుండకూడదు.

మనగృహాలు హృదయాలు కృతజ్ఞతతో నింపబడి ఉండాలి. జ్వరం వచ్చిన స్తోత్రం, నడుమునొచ్చినా స్తోత్రం, వ్యాధియైన బాధయైన దేవునికి స్తోత్రం చెల్లించువారమై యుండాలి. చివరికి చనిపోయే పరిస్థితియైనా దేవునికి స్తోత్రం చెప్పాలి. ఇలా నీవు అన్ని విషయాలకు కృతజ్ఞుడవైయుంటే మొదట ఘటసర్పానికి పిచ్చిపడ్తుంది. వానికి పిచ్చిపట్టాలంటే అన్ని విషయాల్లో దేవునికి స్తోత్రాలు చెప్పాలి. యెహోవా ఇచ్చెను యెహోవా తీసికొనెను అని యోబు దేవునికి కృతజ్ఞతలు చెల్లించి దీవెనలు పొందినట్లుగా మనం దేవుని ఆశీర్వాదాలను పొందుకోవాలి.

## నాలుగవదిగా సమాధాన బలిద్రవ్యముతో నింపబడాలి

**"నీవు ఇశ్రాయేలీయులతో ఇట్లనుము ఎవడు యెహోవాకు సమాధాన బలిద్రవ్యములను తెచ్చునో వాడు ఆ ద్రవ్యములలో నుండి తాను అర్పించబడినది యెహోవా సన్నిధికి తేవలెను. లేవి 7:29"**

దేవునిబిడ్డలు ఎప్పుడు చూసినా సమాధానంగా ఉండాలి. గొడవలకు సూటిపోటి మాటలకు స్థానం ఇవ్వకూడదు. మీ గృహాలు సమాధానముచేత నింపబడాలి. ఇదే సమాధాన బలిద్రవ్యము. ఎంతకాలం కుటుంబంలో గొడవలు ఉంటాయి? ఇకనైనా గొడవలు మానండి. భార్యాభర్తలు సమాధానంగా ఉండాలి, పిల్లలు తల్లిదండ్రులతో సమాధానంగా ఉండాలి. అంతేకాదు సంఘబిడ్డలందరితో సమాధానంగా ఉండాలి. నాకు ఆ సిస్టర్ అంటే పడదు, ఆ బ్రదర్ అంటే పడదు అనే మాట రాకూడదు. నీవు అందరితో సమాధానంగా ఉంటేనే ప్రభుబల్లలో చేయివేయి. ఒకవ్యక్తిపై తీర్పుతీర్చడానికి ఎవరికి అధికారం లేదు. ఎవరైనా కుటుంబంలో, సంఘంలో, మరిముఖ్యంగా దైవజనులతో ఎల్లవేళల సమాధానంగా ఉండాలి. దైవజనులతో అసమాధానంగా ఉంటే దేవునికి నీకు మధ్యలో ఉన్న సంబంధం తెగిపోతుంది. నిన్ను గద్దించినా, హెచ్చరించినా, బుద్ది చెప్పినా దైవజనులతో సమాధానంగా ఉండాలి. వారు నన్ను అందరిముందు గద్దించారు అని సణగకూడదు. వారిని దేవుడే నియమించాడు. ఒక కాపరిచేతిలో దండం ఉంటుంది. గొర్రె ఇష్టంవచ్చినట్లు తిరిగినప్పుడు దాన్ని సరిచేయడానికి కాపరి దండాన్ని వాడవలసివస్తుంది. సేవకులకు వ్యతిరేఖంగా మాట్లాడి, అసమాధానానికి గురియై నీ యింటిలో సాతానుకు అవకాశమివ్వకూడదు. ఇంకా నీ గ్రామంలో నీ ఇరుగుపొరుగువారితో కూడా సమాధానంగా ఉండాలి. మీ దేవుడు వేరు మా దేవుడువేరు, మాకు దూరంగా ఉండండి అని ఏదేదో పనికిరాని మాటలు మాట్లాడి చుట్టూ ఉన్న అన్యులను మీరు చెడగొట్టకూడదు. ఏ విధముచేతనైనా వారిని ప్రభువు దగ్గరకు నడిపించే వారైయుండాలి. ఇలా అందరితో సమాధానంగా ఉండాలి. సమాధానమే నీ కుటుంబానికి ఆశీర్వాదాన్ని తీసుకువస్తుంది. మీ కొట్లను సమాధానముతో నింపుకోవాలి.

1.హోమద్రవ్యం, 2. పరిమళద్రవ్యం, 3. కృతజ్ఞత బలిద్రవ్యం, 4. సమాధాన బలిద్రవ్యం. పైన వివరింపబడినవాటన్నిటితో మన కొట్లను నింపుకొని ఆత్మీయకంగా బలపడాలి. అప్పుడు భూసంబంధంగా దేవుడు నిన్ను దీవించి నీ కొట్లను నింపి నిన్ను హెచ్చించునుగాక ఆమెన్. దేవుడు మిమ్ములను దీవించునుగాక.

మీరు పత్రికయొక్క చందా ఇప్పటివరకు చెల్లించని యెడల దయచేసి వెంటనే చెల్లించవలయును. మీ చందాను మనియార్డరు ద్వారా పంపగోరినట్లయితే "నిస్సీజయధ్వజము, నిస్సీ మినిస్ట్రీస్, శాస్త్రీనగర్, నిర్మల్, ఆదిలాబాద్ 504106" అనే అడ్రస్సుకు పంపించండి. మీ అడ్రస్సులో ఏదైనా మార్పు ఉన్నయెడల లేక క్రమముగా పత్రిక మీకు అందనియెడల మాకు వెంటనే తెలియజేయగలరు. మీకు పత్రికా ఆశీర్వాదకరంగా ఉన్నట్లయితే ఇతరులకు ఈ పత్రికను పరిచయం చేయండి. దేవుడు మిమ్ములను దీవించునుగాక...

# రాత్రిలో పనిచేసే దేవుడు

ఇశాయేలు ప్రజలు ఐగుప్తుదేశాన్ని విడిచి కానాను దేశానికి ప్రయాణమై ఎఱ్ఱసముద్రము దగ్గరకు వచ్చి ఆగిపోయారు కారణం సముద్రము అలలతో ఉప్పొంగుతూ ఉంది. ముందున్న సముద్రాన్ని దాటలేని పరిస్థితి. ఇలాంటి పరిస్థితులలో ప్రజలు వెనుకకు తిరిగినప్పుడు ఫరో ఇశ్రాయేలు ప్రజలను తిరిగి బానిసలుగా ఐగుప్తు దేశానికి తీసుకువెళ్లడానికి తన సర్వసైన్యముతో వస్తున్నాడు. దీనిని ఇశ్రాయేలు ప్రజలుచూసి ఏమిచేయాలో తోచక ప్రజలందరు కూడా మోషేతో అంటున్నారు. ముందు సముద్రంముంది మా వెనుక మమ్మల్ని తిరిగి ఐగుప్తుదేశానికి తీసుకువెళ్లడానికి గుర్రాలు, రథాలమీద ఫరోసైన్యం వస్తుంది. కానాను దేశానికి తీసుకువెళ్తానని సముద్రంలో చంపడానికి తీసుకువచ్చావా? లేక ఫరోచేతిలో చావడానికి తీసుకువచ్చావా? అని ప్రజలు అరుస్తూ, కేకలు వేస్తూ తీక్షణమైన కోపముతో దైవజనుని మీద మండిపడుతున్నారు.

ఆసమయంలో దైవజనుడైన మోషేకు ఏమిచేయాలో తోచలేదు. మోకరించి ప్రార్థన చేసాడు. "ప్రభువా! ప్రజలను బానిసత్వం నుండి విడిపించి పాలుతేనెలు ప్రవహించే కానాను దేశాన్ని ఇస్తానని వాగ్దానం చేసావు. వాగ్దానం ప్రకారంగానే ప్రజలను ఐగుప్తునుండి బయటకు తీసుకువచ్చావు. ముందు సముద్రం వెనుక శత్రువులున్నారు. ఇప్పుడు పరిస్థితి ఏమిటని మోషే ప్రార్థించాడు. ఆ ప్రార్థనాలకించిన దేవుడు మోషేతో నేను చేసే కార్యాన్ని మీరు చూడబోతున్నారు. మీరు ఊరకనే ఉండండి ఫరోతో అతని సైన్యంతో నేను యుద్ధంచేస్తాను. ముందు సముద్రం ఉందని వెనుక శత్రువులున్నారని భయపడకండి. భూమ్యాకాశములను సృష్టించిన నేను మీ పక్షమున యుద్ధంచేస్తాను. మీరు ఊరకనే నిలిచియుండండి అని దేవుడు మోషేతోచెప్పి ఒక అద్భుతం చేసాడు.

మీకు ముందుగానడుస్తానని వాగ్దానం చేసి ఇశ్రాయేలు ప్రజలతో ఐగుప్తు దేశం నుండి బయలుదేరిన దేవుడు ఇశ్రాయేలు సర్వసమూహపు వెనుక భాగానికివెళ్ళి, ఇశ్రాయేలు ప్రజలకును ఫరో సైన్యానికి మధ్యలో భూమికి ఆకాశానికి అంటునంతగా అగ్ని ప్రాకారముగా దేవుడు వారిమధ్యలో నిలబడ్డాడు. ఇశ్రాయేలు ప్రజలు వెనుకకు తిరిగి చూసినప్పుడు అగ్నిజ్వాల అగ్నిప్రాకారంవలె నిలబడి ఉండడం వారు కళ్లారాచూసారు. అప్పటివరకు కలవరపడ్తున్న ప్రజలందరు అగ్నిజ్వాలను చూసి ధైర్యం తెచ్చుకున్నారు. ఫరోసైన్యం మహా బలాఢ్యులు, యుద్ధంలో ఆరితేరినవారు పరుగుపరుగున వస్తూ ఇశ్రాయేలు ప్రజలను సమీపించడానికి ముందుగా వారికి అగ్నిజ్వాల ఒక ప్రాకారంగా ఎదురైంది. గుర్రాలకు అగ్నిజ్వాలలు కన్పించాయి. ఎంతవేగంగా రథాలువచ్చాయో అలాగే ఆగిపోయాయి. సైన్యం ముందుకన్పిస్తున్న దృశ్యం చిన్న మంటకాదు.

భూమి ఆకాశం అంటునంతగా మండుతూఉంది. వారిముందు అగ్నిజ్వాల ఉంది గనుక ఇశ్రాయేలుప్రజలు కన్పించడం లేదు. తెగించిముందుకు వెళ్దామంటే గుర్రాలు ముందుకు సాగడంలేదు. కారణం అగ్నిజ్వాలయొక్క వేడి దూరంగా ఉన్న సైన్యానికికూడా తగిలింది. సైన్యమంతా అలాగే నిలిచిపోయింది. ఒకవైపు ఫరోసైన్యం అగ్నిజ్వాలను చూసి భయపడుతున్నారు కాని ఇశ్రాయేలు ప్రజలైతే ప్రభువా మమ్మల్ని రక్షించుటకు అగ్నిజ్వాలగా దిగివచ్చావు అని సంతోషంగా దేవున్ని స్తుతిస్తున్నారు.

**అప్పుడు ఇశ్రాయేలీయుల యెదుట సమూహమునకు ముందుగా నడిచిన దేవదూత వారి వెనుకకుపోయి వారిని వెంబడించెను. ఆ మేఘస్థంభము వారి యెదుటనుండి పోయి వారి వెనుక నిలిచెను. అది ఐగుప్తీయులసేనకు ఇశ్రాయేలీయుల సేనకు నడుమ ప్రవేశించెను. అది మేఘము గనుక వారికి చీకటికలిగెను గాని, రాత్రి అది వీరికి వెలుగిచ్చెను గనుక ఆ రాత్రిఅంతయు ఐగుప్తీయుల సేన ఇశ్రాయేలీయులను సమీపింపలేదు. మోషే సముద్రమువైపు తన చెయ్యిచాపగా యెహోవా ఆరాత్రి అంతయు బలమైన తూర్పుగాలిచేత సముద్రమును తొలగించి దానిని ఆరిననేలగా చేసెను. నీళ్ళు విభజింపబడగా ఇశ్రాయేలీయులు సముద్రము మధ్యను ఆరిననేలమీద నడిచిపోయిరి. నిర్గమ 14:19**

ప్రజలను ఊరకనే ఉండమని చెప్పి దేవుడుమాత్రం ఊరకనే ఉండక రాత్రిఅంతయు పని జరిగిస్తున్నాడు. తన ప్రజలయొక్క సమస్యను తన భుజానా వేసుకుని తనప్రజలకోసం పనికల్పించుకున్నాడు. ఆ రాత్రి సముద్రాన్ని చీల్చడానికి బలమైన తూర్పుగాలి సముద్రంమీద వీచునట్లుగా చేసి, సముద్రంలో ఉన్న బురదమట్టిని ఆరిన నేలగా చేసాడు. చూడండి దేవుడు రాత్రి పనిచేస్తున్నాడు. మనం ఆరాధించే దేవుడు సోమరిగా నిద్రపోయేవాడుకాదు ఆయన కునుకడు నిద్రపోడు. రాత్రిపగలు పరలోకంలో ఉండవు. రాత్రి అంతా ప్రజలను ఊరకనే ఉండమని చెప్పి దేవుడు పనిచేస్తున్నాడు. బలమైన తూర్పుగాలి చేత సముద్రాన్ని చీల్చాడు. సముద్రంలో ఉన్న బురదనేలంతా కూడా ఆరిననేలగా చేసాడు. తనస్వాస్థంకోసం, తనను నమ్మిన ప్రజలకోసం, తన నామములో ప్రార్థించేవారికోసం రాత్రంతా పనిచేస్తున్నాడు. ఇక్కడ గమనించవలసిన విషయం దేవుడు దినములో పనిచేసాడా? లేదా రాత్రిలో పనిచేసాడా? రాత్రిలో పని చేసాడు. రాత్రి అనగా చీకటి ఈ చీకటి భయానికి, కలవరాలకు, శ్రమలకు సూచన. మనజీవితంలో చీకటి దినములు వస్తాయి. మన కుటుంబాలపై వచ్చే అనేకరకాలైన శోధనలు, వ్యాధులు, నిందలు, అవమానాలు, ఆర్థికఇబ్బందులు, కుటుంబంలో ఉన్న అలజడులు అనేక రకాల సమస్యలు ఇవి చీకటికి సాదృశ్యంగా ఉన్నాయి. చాలామంది ఈ చీకటి బాధలను తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఏమి చేయాలో తోచని పరిస్థితి, రకరకాల సమస్యలతో సతమతమౌతుంటారు.

ప్రియమైన దైవజనాంగమా! నీ కుటుంబంలో నీ జీవితంలో చీకటి నిండిపోయి ఉ

ండవచ్చు ఏలాంటి చీకటి నిన్ను ఆవరించినా దేవుడు అంటున్నాడు నీవు ఊరకనే నిలిచి చూడు నేను చీకటిలో నీ కోసం కార్యాలను మొదలుపెడతాను. అనగా నీ శ్రమలలో, నీ బాధలలో, నీ కష్టాలలో, నీ అనారోగ్యంలో దిక్కులేని పరిస్థితుల మధ్యలో, నీ కన్నీళ్లమధ్యలో నేను నీకోసం కార్యాన్ని చేస్తాను. నాచుట్టు అంతా చీకటి ఆవరించింది. భయంకరమైనరోగం, సమస్యలు ఎటుచూసినా నాకువెలుగులేదు. అంతా చీకటే, అయ్యోనేను బ్రతకడం ఎందుకు? అని నీవు అనుకుంటున్నావేమో ప్రభువు అంటున్నాడు నీవు మౌనముగాఉండు నీ జీవితంలో వస్తున్న సమస్యలకు నీవు భయపడకు. ఈ లోకపుపరిస్థితులు ఏవైనా నిన్ను ఆవరించి నీ బ్రతుకును చీకటిగా మారుస్తే నేనున్నాను, నన్ను జ్ఞాపకంచేసుకో అని ప్రభువు అంటున్నాడు. ఎందుకో తెలుసా? నా ప్రజలకోసం నేను రాత్రంతా, చీకటిలో పనిని కార్యాన్ని జరిగిస్తాను. చీకటితో నిండిన నీ బ్రతుకులో నేను వెలుగును ప్రసాదిస్తాను. నీకు ఎదురవుతున్న అడ్డుబండలను తొలగించి నీకు మార్గాన్ని సరాళంచేసి గమ్యానికి చేర్చేబాధ్యత నాదే అని ప్రభువు సెలవిస్తున్నాడు. దేవుడు నీజీవితమును ఆశీర్వాదకరముగా మారుస్తాడనే నమ్మకం నీకు ఉందా? నీ చీకటి బ్రతుకును వెలుగుతో నింపుతాడనే నమ్మకం నీకుందా? దేవుడు నీ కన్నీటిని తుడిచి నాట్యంగా మారుస్తాడనే నమ్మకం నీకుందా? నీవు పడ్తున్న భయంకరమైన బాధలనుండి విడుదలనిచ్చి, నీ ముఖంలో ఆనందాన్ని, సంతోషాన్ని దేవుడు ఇవ్వగలడు అనే నమ్మకం నీకు ఉందా? ఉంటే ప్రభువు నీతో మాట్లాడుతున్నాడు. తప్పక నీ చీకటి బ్రతుకులో గొప్ప కార్యాన్ని ప్రారంభిస్తాడు. దేవుడు సముద్రాన్ని పాయలుగా చేసి ఎండిన నేలను సిద్ధంచేసాడు. ఇశ్రాయేలీయులు సముద్రంలో నడుస్తున్నారు వారి అడుగులు దిగబడడటంలేదు. దేవుడు పూర్తిగా ఆరిననేలను చేసాడు. అడుగులు దిగబడకుండా వారిని నడిపించాడు. నీవుకూడా ఎక్కడదిగబడకుండా ఆరిన నేలపై నిన్ను నడిపిస్తానని ప్రభువు సెలవిస్తున్నాడు.

ఇశ్రాయేలుప్రజలు వారియొక్క సామాగ్రి, వారి జంతువులు అన్ని కూడా వాటి అడుగులు దిగబడకుండా నడుస్తున్నాయి. ఈరోజు నీ జీవితంలో అడుగుతీసి అడుగువేసేలోపు మరో అడుగు దిగబడుతుంది. ఒక సమస్యనుండి బయటపడగానే మరో సమస్య అందుకే జీవితంపై విసుగు వస్తుంది. ఇక నీ సొంత ప్రయత్నాలన్ని మాని ప్రభువు చేతులకు అప్పగించుకో ప్రభువే నీ కోసం పనిచేస్తాడు. నీవు పనిచేయడం ప్రారంభిస్తే ప్రభువు ఉరకనే నిలిచి చూస్తాడు. కాని నీవు ఊరకనే నిలిచి చూస్తే ప్రభువుపై భారంవేస్తే ప్రభువు పని చేస్తాడు. నీవు ఏపని చేసినా చేసినదల్లా ఓటమి పాలవుతుంది. దేవుడు నీకోసం పనిచేస్తే అది విజయవంతమౌతుంది. ఆలోచించండి! మీరు చేస్తారా? ప్రభువుకు అప్పగిస్తారా? ప్రజలందరు తొందరపడుతున్నారు. ముందు ఎర్రసముద్రం వెనుక శత్రువులు ఏమిటి పరిస్థితి? పారిపోమ్మంటావా? ఎందుకు పారిపోవడం నిలబడమని దేవుడు చెప్పాడు. పారిపోవలసిన అవసరమే లేదు. కొంతమంది

అప్పులు తీర్చలేక, పని చేయలేక పారిపోతారు, నీయంతట నీవేమిచేయలేవు నీవు ఊరకనే ఉండాలి చేసే దేవుడు ఉన్నాడు. నీ చేతులకు పని చెప్పకు ఇశ్రాయేలీయులు ఒడ్డునకు చేరారు. వెనుకఉన్న అగ్నిజ్వాల మాయమైపోయింది. ఇక ఫరో సైన్యం ఇశ్రాయేలు ప్రజలు సముద్రంలో దాటుతున్నట్లుగా ఐగుప్తుసైన్యం కూడ సముద్రం దాటడం ప్రారంభించారు. సముద్రం మధ్యలోనికి వచ్చారు. పరిశుద్ధగ్రంథంలో వారి రథములు సముద్రంలో మునిగిపోయినట్లుగా వ్రాయబడి ఉంది. ఇశ్రాయేలుప్రజల యొక్క అడుగు దిగబడలేదు. శత్రువుల రథాలు దిగబడ్డుతున్నాయి. ఫరో దేవుని ప్రజలను బానిసలుగా తీసుకెళ్లాలని, వారి బ్రతుకులో చీకటిని నింపాలని తరుముతూ ఉంటే దేవుని ప్రజలు ఒడ్డుకు చేరారు. సర్వసైన్యమంతా సముద్రంలోనికి వచ్చేసింది. శత్రువులు తమ వెంటవస్తున్నారని ప్రజలు భయపడుతున్నారు. అతికష్టంమీద సముద్రంలో శత్రువులు వస్తున్నారు. సైనికులు తమలోతాము దేవుడే ఇశ్రాయేలు ప్రజల పక్షమున యుద్ధం చేస్తున్నాడని అనుకుంటున్నారు. ఈవిధంగా శత్రువులు సాక్ష్యం చెప్పులాగున దేవునికి పని అప్పగించాలి. దేవుడు మోషేతో నీ కర్రను పైకెత్తుమనిచెప్పగానే సముద్రం కలిసిపోయింది. సముద్రంలో ఉన్న సర్వసైన్యమంతా కూడా నీళ్లలోమునిగి చనిపోయి, శవాలు నీళ్లమీద లేచి అలలకు కొట్టుకొని ఒడ్డుమీద పడ్డుతున్నాయి. దానినిచూసిన ఇశ్రాయేలీయులు దేవునికి సోత్రగీతం పాడారు.

దేవుడు న్యాయవంతుడు యధార్థవంతుడు న్యాయాన్ని అన్యాయంగా, అన్యాయాన్ని న్యాయంగా మార్చేవాడు కాదు. తన ప్రజలను ఎంతగానో ప్రేమించేవాడు.

**"తన సొంత కుమారుని అనుగ్రహించుటకు వెనుకతీయక మన అందరి కొరకు ఆయనను అప్పగించినవాడు ఆయనతోపాటు సమస్తమును మనకెందుకు అనుగ్రహింపడు?"రోమా 832**

తన ప్రజలకోసం ఫరో సైన్యాన్ని మొత్తం నాశనం చేశాడు. నీవే ఏదో సాధించాలని పరుగెత్తుచున్నావు? నీవు ఏంచేయలేవు. ప్రభువు మీద నమ్మకముంచు కార్యము జరుగుతుంది. తన ప్రియులు నిద్రించుచుండగా ఆయన వారికిచ్చుచున్నాడు. చీకటితో నిండిన నీ బ్రతుకులో, కన్నీటిలో నిండిన నీ బ్రతుకులో, దుఖముతో, సమస్యల ఊబిలో కొట్టుకొనిపోతున్న నీ బ్రతుకులో వెలుగు కిరణాలు యేసుప్రభువు ప్రసాదిస్తాడు దేవుని చేతులకు అప్పగించు. సముద్రమంతటిలో ఒక్క అడుగు దిగబడకుండా ప్రభువు నిన్ను నడిపిస్తాడు.

పరిశుద్ధగ్రంథంలో ఒక మంత్రి ఉన్నాడు. ఇతను సాధరణమైన మంత్రికాదు. ఇతనిమాట రాజు వింటాడు. ఒకసారి పని నిమిత్తం రాజు దగ్గరకు వచ్చి బయటకు వెళ్లుతున్నాడు. రాజు ద్వారము దగ్గర మొర్దెకై అనే ఒకవ్యక్తి ఉన్నాడు. మంత్రిరాగానే అందరులేచి నమస్కారం చేసారు. కాని మొర్దెకై మంత్రిరాగానే నమస్కారం చేయకపోవడం మంత్రి చూసాడు. ఇతను యూదుడు. యూదుడు దేవునికితప్ప మరెవనికి తలవంచడు. అతని తల దించునట్లుగా నేను చేస్తానని హామాను తనమనస్సులో కపటంగా ఆలోచించి, ఇంటికి వెళ్లి సభను ఏర్పాటుచేసాడు.

అందులో ఉన్నవారందరు త్రాగుతూ సంతోషిస్తున్నారు. అంతలో హామాను నాకు సంతోషం ఉందికాని ఒకదు:ఖం కూడా ఉన్నదని వారితో మాట్లాడుతూ రాజు నాకు చాలా ఘనత ఇచ్చాడు కాని ఒకవ్యక్తి నాకు నమస్కరించలేదు, అతను జ్ఞాపకంవచ్చినప్పుడెల్లా వాడు బ్రతికియున్నంతకాలం నా మంత్రిపదవికి విలువలేనట్లుగానే నేను భావిస్తున్నాను అని సభలో తెలిపాడు. అందుకువారు ఈవిధంగా సలహా ఇచ్చారు. నీవు రాజుదగ్గరకు వెళ్ళి అతన్ని ఉరితీయడానికి సెలవు తీసుకో అని తన భార్యా, స్నేహితులు సలహానిచ్చారు. రాజు మొర్దెకైని ఉరితీయుమని చెప్తాడనే ఆలోచనతో మంత్రియైన హామాను తన ఇంటివద్ద మొర్దెకైని ఉరితీయుటకు ఉరికంభమును సిద్ధంచేసి రాజుదగ్గరకు వెళ్ళాడు. ప్రతిరోజు రాత్రి రాజు సాధారణంగానే నిద్రపోయేవాడు కాని ఆరోజు ఏమైందోకాని ఆ రాత్రే రాజుకు నిద్రపట్టడంలేదు. అప్పుడు రాజు నిద్రరావడంలేదు రాజ్యసమాచార గ్రంథాన్ని తీసుకొని, దానిని చదవమని ఆజ్ఞాపించాడు. ఏరోజు ఎవరు ఏమి చేసారో అంతా చదువుతుండగా ఒకరోజు మొర్దెకై చేసినకార్యము గురించి వ్రాయబడివుంది. అదేమనగా రాజునుచంపుటకు రాజుదగ్గరఉన్న ఇద్దరు నపుంసకులు రాజును చంపే ప్రయత్నము చేస్తుండగా, మొర్దెకై రాజనగరులో ఉన్నవారికి ఈ సమాచారాన్ని అందించగా, దానిని విచారించగా అది నిజమని ఋజువయ్యింది. ఇద్దరు నపుంసకులు ఉరితీయబడ్డారు అనే విషయాన్ని చదివాడు. రాజు దానిని విని నా ప్రాణాన్ని కాపాడడానికి మొర్దెకై సమాచారాన్ని అందించినందుకు ఏమైనా బహుమానం అతనికి ఇచ్చారా? అని రాజు అడిగాడు. అప్పుడు చదివినవాడు ఇవ్వలేదని తెలిపాడు.

**ఆ రాత్రి నిద్రపట్టకపోయినందున రాజ్యపు సమాచార గ్రంథముతెమ్మని రాజు ఆజ్ఞ ఇయ్యగా అది రాజు ఎదుటచదివి వినిపింపబడెను. ద్వారపాలకులైన బిగ్తాను తెరెషు అనురాజుయొక్కయిద్దరు నపుంసకులు రాజైన అహష్వేరోషును చంప యత్నించిన సంగతి మొర్దెకై తెలిపినట్టు అందులో వ్రాయబడిఉండెను. రాజు ఆసంగతి విని-ఇందునిమిత్తము మొర్దెకైకి బహుమతి యేదైనను ఘనత యేదైనను చేయబడెనా అని యడుగగా రాజు సేవకులు-అతనికేమియు చేయబడలేదని ప్రత్యుత్తరమిచ్చిరి. అప్పుడు ఆవరణములో ఎవరోయున్నారని రాజు చెప్పెను. అప్పటికి హామాను తాను చేయించిన ఉరికొయ్యమీద మొర్దెకైని ఉరితీయింప సెలవిమ్మని రాజుతోమనవి చేయుటకై రాజనగరుయొక్క ఆవరణములోనికి వచ్చియుండెను. ఎస్తేరు 6:1**

హామాను మొర్దెకైని చంపాలని ఉరికంభమును సిద్ధంచేసాడు. ఉరికంబం మీద మొర్దెకైని ఉరితీయాలని రాజుసెలవు కోసం బయట ఆవరణంలో నిలబడ్డాడు. ప్రతిరోజు సమయానికి నిద్రపోయేరాజు ఆరోజు ఎందుకు నిద్రపోవడంలేదు? మొర్దెకైని చంపాలని హామాను ప్రయత్నాలుచేస్తున్నాడు గనుక దేవుడు రాజుకు నిద్రలేకుండా చేసి, మొర్దెకై గురించి రాజ్యసమాచార గ్రంథంలో వ్రాయబడిన విషయాలు రాజుకు తెలిసే విధంగా చేసి, రాజుకు అతడు నాప్రాణాన్ని కాపాడాడు, అతనికి ఏదైనా బహుమానం ఇవ్వాలని ప్రేరేపణను

కలుగజేస్తున్నాడు. మొర్దెకైని అదే రాత్రి చంపడానికి హామాను వచ్చాడు. అదే రాత్రి మొర్దెకైని కాపాడడానికి దేవుడు దిగివచ్చి రాజుకు నిద్ర పట్టకుండా చేసాడు. హల్లెలూయా...

అంతలో ఆవరణంలో ఉన్న మంత్రిని రాజుపిలిపించాడు. రాజును ఘనపరిచేవానిని ఏవిధంగా ఘనపరచాలి? రాజును సన్మానించి, రాజుకొరకు గొప్పపనులు చేసేవారిని ఏవిధంగా ఘనపరచాలి? అని రాజు అడిగినప్పుడు హమాను తనలోతాను రాజు నన్నుగాకా ఇక ఎవరిని ఘనపరుస్తాడు? అని అనుకున్నాడు. ఈ సంఘటన అంతా రాత్రి జరుగుతుంది. హామాను రాజుతో అంటున్నారు.

**రాజు ఘనపరచనపేక్షించువానికి చేయతగినదేమనగా రాజు ధరించుకొను రాజవస్త్రములను రాజు ఎక్కు గుఱ్ఱము ను రాజు తన తలమీద ఉంచుకొను రాజ కిరీటమును ఒకడు తీసికొని రాగా ఘనులైన రాజుయొక్క అధిపతులలో ఒకడు ఆ వస్త్రములను ఆ గుఱ్ఱమును పట్టుకొని రాజు ఘనపరచనపేక్షించువానికి ఈ ప్రకారముగా చేయతగునని అతని ముందర చాటింపవలెను. అందుకు రాజు నీవు చెప్పిన ప్రకారమే శీఘ్రముగా ఆ వస్త్రములను ఆ గుఱ్ఱమును తీసికొని, రాజు గుమ్మమునొద్ద కూర్చునియున్న యూదుడైన మొర్దెకైకి ఆలాగుననే చేయుము. ఎస్తేరు 6:1**

రాజువేసుకునే వస్త్రాలు, రాజు ఎక్కే గుఱ్ఱం, రాజుకిరీటం మొర్దెకైకి ధరించి గుఱ్ఱంమీద ఊరేగించాలని రాజు మంత్రి అయిన హామానుకు తెలిపాడు. ఏ వ్యక్తినైతే హామాను ఉరితీయాలనుకున్నాడో అదేవ్యక్తి మొర్దెకైని దేవుడు ఊరేగించేవిధంగా చేసాడు. మొర్దెకై పక్షమున దేవుడు రాజుకు నిద్రలేకుండా చేసి రాత్రికిరాత్రే అద్భుతం చేసాడు.

చెరసాలలో పేతురును వేసినప్పుడు చెరసాల తలుపులు తాళాలు వేసి ఉన్నాయి. కాని జైల్లో ఉన్న పేతురు బయటకువచ్చాడు. దేవుడువెళ్ళి మరొతాళపుచెవి తీసుకొని, శబ్ధంకాకుండా నెమ్మదిగా తాళంతీసి, శబ్ధంరాకుండా తలుపువేయడం ఇటువంటి పనులేమి దేవుడు చేయలేదు. ఎన్ని గడియలున్నా, తాళాలున్నా, తలుపులు వేసిఉన్నా, గోడలు అడ్డుగా ఉన్న నిన్ను బయటకు తీసుకువచ్చే శక్తి దేవునికి ఉంది. నీవు నమ్మకముంచు. దేవునిమీద నీకు సరిగా నమ్మకంలేక ఎవరైనా నిన్ను చూడగానే భయం జ్వరం పట్టుకుంటుంది. ఎవరు చూసినా, ఏం చేసినా నీకు అపాయం ఏమి జరగదు. ఎందుకో తెలుసా? నీ పక్షమున దేవుడు ఉన్నాడు. ఎంతకాలం భయపడుతూ పిరికితనంలో ఉంటావు? ప్రభువు అంటున్నాడు ధైర్యం తెచ్చుకో నేను నీ పక్షమున ఉన్నాను. చివరికి మొర్దెకైని ఉరితీయుటకు హామాను సిద్ధంచేసిన ఉరికంబం మీద రాజాజ్ఞ మేరకు హామాను ఉరితీయబడ్డాడు. మొర్దెకైని కాపాడుటకు రాత్రంతా దేవుడు తన కార్యాన్ని చేసాడు. రాజు మనస్సు మార్చాడు, నిద్రలేకుండా చేసాడు, సమాచారగ్రంధపు మాటలు వినునట్లుగా, మొర్దెకైని ఊరేగించునట్లుగా దేవుడు చేసాడు.

దేవుడు నీజీవితంలో కూడా అటువంటి అద్భుతకార్యాలు చేసి నిన్ను ఊరేగిస్తాడు. రాజు ఎక్కేగుఱ్ఱం నేను ఎక్కగలనా? రాజు ధరించే కిరీటం నేను ధరించగలనా? రాజువేసే

వస్త్రాలను నేను వేసుకునేంత యోగ్యత, స్థాయి, అధికారం ఉన్నతస్థితికి నేను చేరగలనా? అని నీవు అనుకుంటున్నావేమో నీ కుటుంబాలలో దేవుడు అద్భుతం చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. నమ్మిక మాత్రముంచుము.

నాకుతెలిసిన ఒక కుటుంబం ఉంది. ఏపూటకాపూట కూలిపని చేసుకొని పూట గడిపే పరిస్థితి వారిది. రోడ్ ప్రక్కన డేరాలో బ్రతుకుతున్నారు. ప్రభువును నమ్మండి, మీరు బాగవుతారు అని ఒకరు సాక్ష్యం చెప్పగానే వారు 5గురు కుమారులు 1కూతురు పెద్దకుమారుడు తల్లిదండ్రులతోపాటు దేవుని నమ్ముకున్నాడు. ఇతను బార్‌హోటల్‌లో త్రాగుబోతుల మధ్యలో పనిచేస్తాడు. ఇలా 5సం॥లు గడిచాయి. తర్వాత దైవజనులు చెప్పే వాక్యం మీద మనస్సుంచాడు. దేవుడు మనలను ఆశీర్వదించి తలగానే గాని తోకగా ఉంచడనే మాటలమీద విశ్వాసంకలిగి, దేవునిపై ఆధారపడి రూ 5000/- లతో అన్నదమ్ములందరు కలిసి వ్యాపారాన్ని మొదలుపెట్టారు. వ్యాపారాన్ని దేవుడు దీవించి రూ 10,000/- ల వ్యాపారంగా దేవుడు చేసాడు. కాని 2సం॥ల వరకు వ్యాపారంలో అభివృద్ధిలేదు. ఒకరోజు దైవజనులు మీరు మీ కష్టార్జితంలోనుండి దశమభాగం దేవునికి ఇస్తే దేవుడు ఆశీర్వదిస్తాడనే వర్తమానం అందించారు. విన్నమాట ప్రకారంగానే పేదవారైనా వారియొక్కరాబడిలో దశమభాగంతీయడం ప్రారంభించారు. వారి10,000 రూ/- వ్యాపారం దినదినం అభివృద్ధి అవడం ప్రారంభమైంది. ఈరోజు వ్యాపారంకొన్నికోట్ల రూపాయలవరకు అభివృద్ధి చెందింది. కోటీశ్వరులుగా దేశవిధేశాలలో తిరుగుతున్నారు. ఎంతటి పేదవారు? ఎక్కడిది ఈ ఆశీర్వాదం? దేవుడు నీవున్న స్థితినుండి ఉన్నత స్థితికి ఎదిగించగల శక్తిమంతుడు. పెంటకుప్పమీదనుండి దీనులను పైకెత్తువాడు. నేలమంటినుండి దరిద్రులను లేవనెత్తువాడు. దేవుడు ఈకార్యం చేయగలడా? అని సందేహపడకండి. నీవు దేవునికి పనిని అప్పగించు నీకోసం ఏదైనా చేస్తాడు. మోర్దెకై పేదవాడే కాని రాజు ఎక్కేగుఱ్ఱం ఎక్కాడు. రాజు ధరించే కిరీటం ధరించాడు. రాజువేసే వస్త్రాలువేసి రాజ వీధులలో ఊరేగించబడ్డాడు. తరువాతకాలంలో దేశానికే ముఖ్యమంత్రిగా మారాడు. నీకోసం దేవుడు ఏదైన చేస్తాడు.

అష్షూరురాజు విస్తారమైన సైన్యాన్ని తీసుకొని ఇశ్రాయేలు ప్రజల మీదయుద్ధానికి బయలుదేరాడు. రాజైన హిజ్కియ ప్రజలను పరిపాలిస్తున్నాడు. అష్షూరురాజు తన ఉత్తరాన్ని " ఇదిగో నేను ఫలానిదేశాన్ని జయించాను అని ఏఏదేశాలను అతడు జయించాడో వాటియొక్క పేర్లన్నిటిని వాసి, మీ దేశాన్నికూడా నేను జయిస్తానని, వారిని చిత్తుగా ఓడించిన విధంగా మిమ్మల్ని ఓడిస్తాను. మీ దేవుడైనయెహోవా మమ్మల్ని కాపాడగలడని రోజు ప్రజలకు తెలియజేస్తున్నావు. నీ దేవుడు నిన్ను కాపాడలేడు. శత్రురాజులు ఎవరైతే ఉన్నారో వారిదేవతలు వారి రాజ్యాలను కాపాడలేకపోయినాయి గనుక నీ దేవుడు నీదేశాన్ని కాపాడలేడు. నీదేవుడైన

యెహోవా మీదఉన్న నమ్మకాన్ని తొలగించి, నా మాటవిని, తలవంచి రాజ్యాన్ని అప్పగించు"మని ఇంకా అవమానాలతో కూడిన మాటలను ఉత్తరంలో వ్రాసి హిజ్కియరాజుకు పంపించాడు. హిజ్కియారాజు ఏడుస్తూ, మందిరానికి వెళ్ళి ప్రార్థన చేయడం ప్రారంభించాడు. "ప్రభువా! అతను అనేక దేశాలను జయించాడు వాస్తవమే కాని వారు ఆరాధించే దేవతలు వెండి బంగారుతో చేయబడ్డాయి. నీవు జీవముగల దేవుడవు. నీవు దేవుడవని అష్షూరురాజుకు తెలియాలి. అష్షూరురాజుతో నీవే యుద్ధంచేయాలని ప్రార్థనచేసాడు. **"ఆ రాత్రియే యెహోవాదూత బయలుదేరి అష్షూరువారి దండుపేటలోజొచ్చి లక్షయెనుబదియయిదు వేలమందిని హతముచేసెను." 2రాజులు 19:35** ఆ రాత్రే దేవుడు అద్భుతకార్యమును జరిగించాడు.

అమాలేకీయులు, మిధ్యానీయులు అనే శత్రువులు ఇశ్రాయేలు ప్రజలమీదకు యుద్ధానికి వచ్చారు. అప్పుడు న్యాయాధిపతిగా గిద్యోను ఉన్నాడు. వారిపై యుద్ధానికి 32వేలమంది సైన్యం బయలుదేరింది. దేవుడు 32వేలమంది యుద్ధానికి చాలా ఎక్కువ వీరిని ఇంటికి పంపిచమని చెప్పినప్పుడు 22వేలమందిని ఇంటికి పంపంచాడు. నీళ్ళదగ్గర పరీక్షించమని చెప్పితే 9700మందిని యుద్ధానికి పనికిరాకుండా దేవుడు ఇంటికి పంపించాడు. 300 మందిని గిద్యోనుతీసుకొని అమాలేకీయులు, మిద్యానీయుల యుద్ధానికి వెళ్ళాడు. శత్రువులు ఇసుకరేణువులంతగా సైన్యం వారిముందు నిలబడిఉన్నది. కాని దేవుడు ఆరాత్రే తన కార్యాన్ని జరిగించాడు.

**" ఆరాత్రి యెహోవా అతనితో ఇట్లనెను- నీవులేచి దండుమీదికిపొమ్ము, నీ చేతికి దానినప్పగించెదను. పోవుటకు నీకు భయమైనయెడల నీ పనివాడైన పూరాతో కూడ దండుకు దిగిపొమ్ము. వారు చెప్పుకొనుచున్న దానిని వినినతరువాత నీవు ఆదండులోనికి దిగిపోవుటకు నీచేతులు బలపరచబడునని చెప్పగా, అతడును అతని పనివాడైన పూరాయును ఆ దండులోనున్న సన్నద్ధుల యొద్దకుపోయిరి. మిద్యానీయులును అమాలేకీయులును తూర్పువారును లెక్కకు మిడుతలవలే ఆ మైదానములో పరుండియుండిరి. వారిఒంటెలు సముద్రతీరమందున్నయిసుక రేణువులవలె లెక్కలేనివై యుండెను. గిద్యోనువచ్చినప్పుడు ఒకడు తాను కనిన కలను తన చెలికానికి వివరించుచుండెను. ఎట్లనగా నేనొక కలగంటిని, అదేమనగా యవలరొట్టె ఒకటి మిద్యానీయుల దండులోనికి దొర్లి యొక గుడారమునకు వచ్చి దాని పడగొట్టి తలక్రిందు చేసినప్పుడు ఆ గుడారము పడిపోయెనని చెప్పెను. అందుకు వాని చెలికాడు అది ఇశ్రాయేలీయుడైన యోవాషు కుమారుడైన గిద్యోను ఖడ్గమేగాని మరేమికాదు. దేవుడు మిద్యానీయులను ఈ దండంతను అతని చేతికి అప్పగింపబోవుచున్నాడని ఉత్తరమిచ్చెను. " న్యాయాధి 7:9**

ఆ రాత్రియే మిద్యానీయుల దండులో కలవరాన్నిలేపాడు.

**వారిలో ప్రతివాడును తనచోటున దండు చుట్టూ నిలిచియుండగా ఆ దండువారందరును పరుగెత్తుచు కేకలువేయుచుపారిపోయిరి. ఆ మూడువందలమంది బూరలను ఊదినప్పుడు యెహోవా దండంతటిలోను ప్రతి వాని ఖడ్గము వాని పొరుగువాని మీదికి త్రిప్పెను. దండు సేరెరాతువైపున నున్న బేత్షిత్తావరకును తబ్బాతునొద్దనున్న**

**అబేల్మెహోల తీరమువరకు పారిపోగా నఫ్తాలి గోత్రములోనుండియు, ఆషేరు గోత్రములో నుండియు, మనష్షే గోత్రములోనుండియు పిలిపింపబడిన ఇశ్రాయేలీయులు కూడుకొని మిద్యానీయులను తరిమిరి. న్యాయాధి 7:21**

దేవుడు శత్రువుల దండులో కలవరాన్నిలేపి, ఒకరినొకరు పొడుచుకుని చంపుకునే విధంగా దేవుడు చేసాడు.

రాత్రికి రాత్రే సముద్రాన్ని పాయలుగాచేసి, ఆరిన నేలను చేసి ఇశ్రాయేలీయులను ఒడ్డుకు చేర్చాడు. రాత్రికిరాత్రే రాజుకు నిద్రలేకుండా చేసి హామానును ఉరి తీయులాగున చేసాడు. రాత్రికిరాత్రేవెళ్ళి దేవదూత లక్షఎనుబదియైదు వేల మందిని హతమార్చెటట్లు చేసాడు. రాత్రికిరాత్రే శత్రువులు ఒకరినొకరు పొడుచుకొని చంపే విధంగా దేవుడు చేసాడు. రాత్రికి రాత్రే చెరసాల సంకెళ్ళు తెంపి పేతురును విడిపించాడు.

ప్రియమైన దైవజనాంగమా! రాత్రికిరాత్రే అనగా శ్రమలు, శోధనలు, నిందలు, అవమానాలు, కష్టాలు, అప్పులు, బలహీనత, అనారోగ్యం, కుటుంబసమస్యలు ఇవి అన్ని చీకటి సంబంధించిన క్రియలే. చీకటితో నిండిన నీ బ్రతుకులో దేవుడు కార్యాన్ని చేస్తాడు. చీకటి నిండిన నీకుటుంబములో కార్యాన్ని చేస్తాడు. దిక్కుతోచని కన్నీళ్ళలోయల మధ్యలో, శత్రువుల అవమానాల మధ్యలో తలదించిన నీ జీవితంలో కార్యాన్ని దేవుడు జరిగిస్తాడు. ఆలస్యం అవుతుందేమో కాని అద్భుతం తప్పక జరుగుతుంది. నిరాశపడే పరిస్థితులు వస్తాయి కాని నిరాశ చెందకండి. నీ సమస్యలు తీరాలని, నీ కుటుంబం కట్టబడాలని, ఆర్థిక పరిస్థితులు మెరుగు పడాలని, పిల్లల భవిశ్యత్ స్థిరపడాలని, ఆత్మీయంగా ఎదగాలనే ఆశ నీలో ఉన్నప్పుడు దేవుడు నిన్ను నిరాశపర చక తప్పక నీ ఆశను తీరుస్తాడు. చీకటితో నిండిన నీ హృదయంలో గొప్ప వెలుగును ప్రసాదిస్తాడు. నిన్ను ఆవరించిన చీకటిపరిస్థితులేవైనా భయపడకు.

ఒక యవనస్తుడు వాక్యం విని సంధించబడి నా దగ్గరకు వచ్చి నాతో తన పరిస్థితిని తెలిపాడు. తనఊరిలో తలఎత్తలేని పరిస్థితి, బంధువుల మధ్యలో అందరితో అవమానాలు ఎదురవుతున్నాయి. ఈ పట్టణానికి నేను ఒక్కడినే వచ్చాను. తన పరిస్థితినంత నాకు వివరించి చెప్పాడు. నేనన్నాను ఎక్కడైతే తలదించుకున్నావో అక్కడే దేవుడు నిన్ను ఘనపరుస్తాడు ధైర్యంగా ఉండు. నమ్మకంగా నీ పనిని జరిగించు అని కొన్నిమాటలు చెప్పి పంపించాను. సంవత్సరము తర్వాత ఇంటికివెళ్లినప్పుడు సాధారణమైన వ్యక్తిగా వెళ్లలేదు. ఎక్కడైతే తలదించాడో, తన ఊరిలో బంధువుల మధ్యలోనికి ఆశీర్వాదంతో వెళ్ళాడు. ఊరివారందరు చుట్టుకొని అతని దీవెన, ఆశీర్వాదాలు, మార్పు, దేవునిచేత దీవించబడిన విధానం అంతా ప్రజలుచూసి ఆశ్చర్యపోయినారు.

చీకటి బ్రతుకులను, నిందలతో అవమానాలతో, కరువు కష్టాలతో నిండిన బ్రతుకును ఆశీర్వాదకరంగా మార్చగలడు మన యేసయ్యా. రాత్రికిరాత్రే పని ప్రారంభిస్తాడు. నీవు భయపడకు ధైర్యంగా దేవునిమీద విశ్వాసముంచు దేవుడు తప్పక సహాయం చేస్తాడని  స్థిరంగా నమ్ము

దేవుడు కార్యం చేస్తాడు. కన్నీటిని నాట్యంగా మార్చి, చీకటిని వెలుగుగా మార్చి, నిన్ను ఆత్మీయకంగాను ఆర్థికంగాను అన్ని విషయాలలో ఉన్నత స్థానాలలో నిలబెడ్తాడు. నీవు ఊరకనే నిలిచియుండు దేవుడు కార్యాన్ని జరిగిస్తాడు. చేసేంతవరకు ఓపికతో ఎదురుచూడు. దేవుడు చేసిన కార్యాలు శాశ్వతంగా దీవెనకరంగా, ఆశీర్వాదకరంగా ఉంటాయి. వర్థిల్లిన స్థానంలో యోసేపును,దానియేలును, మోర్దెకైని నిలబెట్టిన దేవుడు నిన్ను నిలబెట్టి విజయోత్సవాలతో ఊరేగించి, తలదించకుండా ఉన్నత శిఖరాల్లో నిన్ను ఉంచుతాడు. ఈరోజు చీకటి బ్రతుకులో కృంగిపోతున్న నీవు నిరాశచెందకు ధైర్యంగా ముందుకు సాగు దేవుడు మిమ్ములను దీవిస్తాడు.


# నిస్సీ

## పాటల సి.డి.లు

1. నా దాగుచోటు నీవే
2. మహోఘనుడా
3. ఇంపైన సువాసన
4. కృతజ్ఞతార్పణలు
5. నా గమ్యము నూతన యెరుషలేము
6. ఇశ్రాయేలు దేవా NEW
7. స్తోత్రార్పణ NEW

## విసిడిలు మరియు డివిడిలు

1. నేను మీకు క్షేమము కలుగజేసెదను
2. మలిన వస్త్రాలు
3. నాకు దీవెన దయచేయుము
4. నీ సూర్యుడికను అస్తమింపడు
5. ధైర్యము తెచ్చుకొనుము
6. నిరీక్షణ
7. నిన్ను నడిపించును
8. సౌందర్యము
9. ఐక్యత
10. ఆలోచన
11. సిలువను మోయుట
12. జయించిన వారికి ఆశీర్వాదము
13. నీకురాజుఎవరు ?

## ప్రసంగముల ఆడియో సి.డి.లు

1. పాపములో మరణించుట
2. పరిశుద్ధత గుర్చి దర్శనము
3. రమ్యమైన గుడారము
4. దహించు అగ్ని
5. ఆమె దీపము ఆరిపోదు
6. బలవంతుని చేతిలో
7. నా క్షేమానికి ఆధారం
8. నీవేమి ధరించితివి
9. పక్షి రాజు
10. అగ్ని జ్వాలలు
11. దీన మనస్సు తో చేసిన ప్రార్థన
12. దైవ నడిపింపు
13. అంజూరపు చెట్టు
14. పరలోకపు అగ్ని , పాతాళపు అగ్ని
15. కలత చెందనివాడు
16. ఉధ్యానవనము
17. సిద్ధపాటు
18. క్షయభీజము అక్షయ భీజము
19. ఎండిన ఎడారిలో లేతమొక్క
20. గోపురము
21. జయము మనదే
22. లెబనోను సౌంధర్యం
23. దైవజనుని మాట వినుట

పాటల సి.డి ఒక్కటి 50రూ॥. ప్రసంగములు ఒక్కటి 30రూ॥ విసిడి, డివిడి ఒక్కటి 50రూ॥లు కావలసినవారు పోస్టు ద్వారా మనియార్డరు పంపి వీటిని పొందగలరు. పోస్టల్‌చార్జీలు అదనం. మా అడ్రస్ ...

**Nissi Ministries, H.No. 1-3-132/A6**
**ShastriNagar, Nirmal, Adilabad. 504106**
**Phone:08734-240147, 9390011485**

**ఈ పరిచర్య నిమిత్తం కానుకలను, చెక్కులను, డిడిలను ఈ క్రింది అడ్రస్సుకు పంపగలరు**

M.Jayaraj SBI- Branch: Nirmal A/c No: 31665876753

IFSC Code: SBIN0006405

Regd. of Newspaper of India
TELTEL/2015/60909

Regd. No. ADB/012/2012-14
License to post on concessional rates

Printed matter

To,

# నిస్సీ మినిస్ట్రీస్

**శాస్త్రీనగర్, నిర్మల్, ఆదిలాబాద్ 504106**

**ఫోన్ : 08734-240147, 9390011485**

Website: www. nissi ministries.org

Email ID: nissi.ministries@yahoo.com

**Published By: M. Priyadarshini W/o M. jayaraj, H.No. 1-3-132/A6**
**Shastrinagar, Nirmal, Adilabad Dist. Pin: 504 106**

**Edited Printed & Owned by: Pastor. M. Jayaraj, H.No. 1-3-132/A6**
**Shastrinagar, Nirmal, Adilabad Dist. Pin: 504 106**